తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1985 మినీకథల పోటీలో రు.250/-లు బహుమతి పొందిన రచన

**శివకేశవులు రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి రాజోలు రెడ్డి గారి బావమరిదే అయినా, అతను మాత్రం తాలూకాఫీసులో గుమాస్తా గిరీయే వెలగబెడుతున్నాడు.**

అతను మా ఎదురింట్లోనే అద్దెకుండటంతో నాకు అతని గురించి చాలా బాగా తెలుసు.

అతనికి ఆరుగురు ఆడపిల్లలు. మొదటి దానికి పెళ్ళయిన పదిహేను రోజులకే కదుపొస్తే, మొగుడొదిలేశాడు. రెండో దాని కిప్పుడు సంబంధం చూశారు. వచ్చే నెల్లోనే పెళ్ళి. అల్లుడు విజయవాడలో ఏదో బేంకులో ఉద్యోగం చేస్తున్నాడట. కట్నం డెబ్భయ్ వేలని తెలిసి సొమ్మసిల్లిపోయిన మా ఆవిడ అదేదో అంటువ్యాధిలా నన్నూ మూర్ఛ పోగొట్టింది.

నాకుగాని, మా వీధిలో వాళ్ళకి గాని, తెలిసినంత వరకూ శివకేశవులుకి స్థిరచరాస్తుల వంటి/వేవీ లేవు. అలాంటిది వట్టి కట్నవే డెబ్భయ్ వేలయితే, లాంఛనాలు, ఖర్చు కమామిషులు మరో ముప్ఫయ్ అన్నా వేసుకుంటే, మొత్తం లక్ష.

కొంపతీసి లాటరీ లాంటి దేవైనా వచ్చిందా అంటే ఏ పేపర్లోనూ శివకేశవులు పేరు పడలేదు. పోనీ, బావ సాయం చేశాడా అనుకుంటే-

రాజోలు రెడ్డి తరహాయే వేరు. అతగాడు మా ఊళ్ళో అందరికీ తెలుసు. మొదట్లో బోషాణపు పెట్టంత చెక్క పెట్టె నెత్తిమీద పెట్టుకొని వీధులు తిరిగి, అయిస్క్రీమ్‌లు అమ్ముకునేవాడు. పిల్లికి బిచ్చం పెట్టని తత్వం. ఎలా తిరిగిందోగాని అతని దశ, కొన్నాళ్ళకి సంత బజారు సందులో ఓ అయిస్క్రీం పార్లర్ పెట్టేశాడు.

అలా అలా గ్రోమోరో, మరేదో వేసిన మొక్కలా రోజు రోజుకీ ఎదిగిపోతూ, చూస్తుండ గానే ఆకురాయివారి పేటలో ఓ డాబా యిల్లు లేపేశాడు. ఆ తరువాత అతని దృష్టి రాజకీయాల మీదకి మళ్ళింది. ఎన్నికలలో నిల బడ్డాడు. ఓడేడు. మళ్ళా నిలబడ్డాడు. మరోసారి ఓడేడు. మూడవసారి మాత్రం మురికి వాడల్నీ, కాలువల్నీ నాటుసారాతో ప్రవహింపజేసే సరికి బంపర్ మెజారిటీతో ఎమ్మెల్లే అయిపోయేడు. మంత్రివర్గ నిర్ణయం జరిగే ముందు రాత్రి, కూతుర్ని పార్టీ ప్రెసిడెంటుకి అప్పజెప్పేసే దంటారు కొందరు. ఆ విషయం ఎంత వరకూ నిజమో నాకు తెలీదు గాని, మొత్తానికి రాజోలు రెడ్డిని కేబినెట్ మంత్రి పదవి వరించేసింది.

అయిదేళ్ళ వరకూ ఢోకా లేని పదవి. దోచేసు కోవటం మొదలు పెట్టేడు. ఖర్మ కాలి ఏ అర్ధరాత్రి పూటో హఠాత్తుగా మంత్రి వర్గం తిరగబడిపోయినా, తను గద్దె మీంచి జారి పోయినా యిబ్బంది లేకుండా ఉండేందుకు గాను, హైదరాబాద్‌లోనే కాక మరో నాలుగైదు పెద్ద పెద్ద నగరాల్లో ఎయిర్ కండిషనింగ్ సినిమా హాళ్ళూ, ఖరీదైన హోటల్సు కట్టించి పారేశాడు. మంత్రి కాక ముందు మంత్రి కావటానికి అతగాడు ఏం ఖర్చు పెట్టేడో అదే ఖర్చు. అటుపిమ్మట సొమ్ము ఖర్చు పెట్టే విషయంలో 'వన్ వే ట్రాఫిక్' విధానాన్ని పాటించటం మూలంగా అతని కొంపలో బేంకుల తాలూకూ సేవింగ్ స్లిప్పులే కన బడతాయి తప్ప, విత్‌డ్రాల్ స్లిప్పులు కని పించవు.

గత ఏడాది కూతురి పెళ్ళి చేశాడు. ఒక కర్మాగారంలో నాలుగు అదనపు ఆఫీసర్ల పోస్టుల్ని సృష్టించేడు. ఆవిడ పురిటి కొచ్చింది. ఇద్దరు హయ్యరు గ్రేడు ఆఫీసర్లని మీ ఉద్యోగాలు మా కక్కర్లేదు పొమ్మన్నాడు (చమురు తగిలేక రమ్మన్నాడనుకోండి).

అలాంటి రాజోలు రెడ్డి, బావ మరిది కూతురు పెళ్ళి గురించి బేంకు లోంచి అంత పెద్ద మొత్తం తీసి యిస్తాడనుకోవటం వెర్రితనం. ఉన్నట్టుండి ఆ ఉదయం మా ఆవిడో కొత్త విషయం నా చెవినేసింది.

శివకేశవులు చెఱువుపాలెం అవతల ఉన్న పోరంబోకు స్థలాన్ని అయిదు వేలకి కొన్నాడట. అతనికి అంత డబ్బెక్కడిది? అయినా, వెయ్యి రూపాయిలకైనా ఆ స్థలాన్ని కొనటానికి ఎవరూ ముందుకి రారు. నగరం లోని మురికి యావత్తూ కాలవల గుండా ప్రవహించి వరదలై పారుతుంటుంది ఆ ప్రదేశంలో.

శివకేశవులు ప్రవర్తన నాకు వింతగా అనిపించింది. ఆ మధ్యాహ్నం తాలూకాఫీసులో పంజేసే ఒక మిత్రుడి ద్వారా తెలిసింది, శివకేశవులు కాబూలీవాలా దగ్గర నూటికి పది లెక్కన అప్పుచేశాడన్న విషయం.

అప్పుచేసి పోరంబోకు స్థలాన్ని కొన్న పెద్ద మనిషి లక్ష రూపాయలు పెట్టి కూతురు పెళ్ళి ఎలా చేస్తాడు? నాకంతా మిస్టరీలా అనిపించింది.

పెళ్ళి పనులు మాత్రం నిర్విఘ్నంగా జరిగి పోతున్నాయి. వారం రోజుల నుండీ వీధి ఆడ వాళ్లు సుందర రామయ్యగారి విశాలమైన వరండాలో మటాలు వేసుకొని బియ్యం, పప్పు దినుసులు ఏరి శుభ్రం చేస్తున్నారు.

పెళ్ళి మరో పది రోజులుందనగా, శివకేశవులు ఇంటి ముందు ఒక జీపు ఆగింది. లోపలి గదిలో కిటికీ ముందు కూర్చొని కాఫీ తాగుతున్న నేను, లేచి వీధిలో కొచ్చి నిలబడ్డాను.


జీపు అద్దాల మీద తెల్లటి అక్షరాలు మెరుస్తున్నాయి. 'గవర్నమెంటాఫ్ ఆంధ్రప్రదేశ్'- జీపు లోంచి నలుగురు దిగేరు. వాళ్ళు చాలా చాలా పెద్ద ఆఫీసర్లు అన్నందుకు నిదర్శనంగా, వాళ్ళ కదలికలోని అణువణువునా హుందాతనం



## పరిచయం

అయిదారేళ్ళుగా రచనా వ్యాసంగంలో వున్నా పత్రికలకు పంపింది తక్కువే. నా రచనలు స్వాతి, ఆంధ్రజ్యోతి, విజయ వగైరా పత్రికలలో వస్తుంటాయి. రచనకి బహుమతి రావటం ఇది రెండవసారి. హృదయాన్ని కదిలించి, ఆలోచన రేకెత్తించే ఏ రచనైనా నా అభిమాన రచనే. నాటికలు రాసి ప్రదర్శింపజేయడం ద్వారా ఆంధ్ర ప్రేక్షక లోకానికి చిరపరిచితురాలనే. శ్రీవారి ఉద్యోగం రీత్యా ప్రస్తుతం ఖర్గపూర్‌లో నివాసం.

—పుష్పాత్రినాథ్, ఖర్గపూర్



# లాజిక్

పుష్పాత్రినాథ్

ప్రతి ఫలిస్తుంది.

తాలూకాఫీసులో శివకేశవులుది ఫైనాన్స్ డిపార్ట్‌మెంటు. వేల కొద్దీ సొమ్ము అందుబాట్లో ఉంటుంది. శివకేశవులుగాని లక్షో రెండు లక్షలో కొట్టేసి ఉంటాడా? ఆ సొమ్ముతోనే కూతురు పెళ్ళి ఘనంగా జరిపించాలనుకుంటున్నాడా? యిప్పుడు ప్రభుత్వానికా విషయం తెలిసిందా? ఇప్పుడొచ్చిన వాళ్ళు శివకేశవుల్నీ, అతని కొంపనీ సోదా చేస్తారా? ఆ తరువాత పోలీసులు బేడీలు వేసి తీసుకు వెళతారా?

గంట తరువాత లోపలికి వెళ్ళిన ఆ నలుగురూ పైకొచ్చి జీపులో కూర్చున్నారు.

ఆ మర్నాడు ఆఫీసులో తెలిసింది.

శివకేశవులు చెఱువుపాలెం అవతల తీసుకున్న స్థలంలో ప్రభుత్వం టైర్ల ఫేక్టరీని నెలకొల్పాలని భావిస్తూందట. కాబట్టి, స్థలాన్ని అమ్మమని అడగటాని కొచ్చారట. శివకేశవులు లక్షకి తగ్గనంటున్నాడట. వాళ్ళు ప్రభుత్వంతో కూడ బలుక్కొని వస్తామని వెళ్తారట.

ఎంత అదృష్టం! అయిదు వేలకి కొన్న స్థలం, లక్ష ఆర్జించి పెడుతూంది. అదీ ఒక్క నెల రోజుల్లో. అసలు అర్ధంతరంగా ఇలా సొమ్ము కలసి వస్తుందని శివకేశవులుకి ముందే తెలుసా? అందుకే అంత ఖరీదైన పెళ్ళి కొడుకుని బేర మాడి ఉంచుకున్నాడా? ఎవరైనా జోశ్యం చెప్పేరా? అతను నమ్మేడా, అది నిజవయిందా?

ఆ తరువాత తెలిసింది.

శివకేశవులు హైదరాబాదు వెళ్లి రాజోలు రెడ్డిని కలిసి-

''పెద్ద కూతురు బతుకలాగయింది. అయిదో కూతురు ఎదిగి నెలే అయింది. ఆరో కూతురు పరిస్థితి ఇవాళో రేపో అన్నట్టుగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో రెండో దాన్ని కూడా ఏ చవకబారువెధవకో అంటగట్టేసి యిబ్బందులు పడే కంటే, కాస్త ఖర్చయినా ఈ సారి గొప్పింటి సంబంధవే చేయాలనుకుంటున్నాను. అందుకు నీ చేయూత కావాలి. నువ్వు సొమ్ము సర్దాలి'' అన్నాడట.

'డబ్బా?'- రాజోలు రెడ్డి గక్కుర్రుమన్నాడు.

''కాదన కు బావా, నీకు దణ్ణం పెడతాను'' శివకేశవులు చేతులు జోడించేడు.

''ఎంత?''

''లక్ష!''

రాజోలు రెడ్డి గట్టిగా కనులు మూసుకున్నాడు. అర నిముషం తరువాత తెరిచి-

''సంబంధం కుదుర్చుకురా చూద్దాం'' అన్నాడు.

ఆ మ ర్నాడు అతను అసెంబ్లీలో, త్వరలో నిర్మించబోయే టైర్ల పరిశ్రమ గురించి చర్చిస్తూ-

''ఇది వరకు పాల్వంచలో నెల కొల్పాలని తీర్మానించిన టైర్ల ఫ్యాక్టరీని కొన్ని సాంకేతికమైన యిబ్బందులమూలంగా, ఫిరంగిపురంలో నిర్మించాలని భావిస్తున్నాం. స్థలం కోసం అన్వేషణ జరుగుతూంది'' అన్నాడు.

ఆ వార్త నేను పేపర్లో చదివేను. అయ్యా, ఇదండీ కథ!

